సాక్షి చిత్తూరు
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



జేసీ మేడం..న్యాయం చేయండి

'జేసీ మేడం.. సమస్యలు పరిష్కరించండి' అంటూ పలువురు వేడుకున్నారు. కలెక్టరేట్‌కు అర్జీదారులు క్యూకట్టారు.

- 8లో



యూరియా టోకెన్ల డ్రామా!

కూటమి ప్రభుత్వం యూరియా టోకెన్ల డ్రామాకు తెరలేపింది. అరకొర అందించి రైతులకు చుక్కలు చూపిస్తోంది.

- 8లో



బడిలో చేర్చాలి

బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి, ఏఎస్‌ఓ నంద కుమార్ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

జిల్లాకు రేపు దేవదాయశాఖ మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్/కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 27వ తేదీన విచ్చేయనున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఉదయం 8 గంటలకు తిరుపతి జిల్లా కేంద్రం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి కాణిపాకానికి చేరుకోనున్నారు. అనంతరం వరసిద్ధి వినాయక స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కాణిపాకానికి ప్రత్యేక బస్సులు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిత్తూరు నుంచి కాణిపాకానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీపీటీఓ రాము తెలిపారు. సాధారణ రోజుల్లో ఐదు బస్సులు 55 ట్రిప్పులు తిరుగుతాయన్నారు. చవితి రోజు 12 బస్సులు, 130 ట్రిప్పులు తిరిగేలా చూస్తామన్నారు. అలాగే పుష్పపల్లకీ, రథోత్సవానికి పది బస్సులు కేటాయించగా 110 ట్రిప్పులు తిప్పుతామన్నారు.

నిర్లక్ష్యం వద్దు



సమస్యలు వింటున్న చిత్తూరు డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్: ప్రతీ వారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఏఎస్పీ, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. మొత్తం 32 ఫిర్యాదులు రాగా.. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌస్ అధికారులతో మాట్లాడారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యం



సమీక్ష సమావేశంలో పాల్గొన్న యువరాజ్

కుప్పం: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పరిశ్రమలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్. యువరాజ్ తెలిపారు. సోమవారం కుప్పం కడా కార్యాలయంలో వివిధ పారిశ్రామిక పార్కులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద కుప్పంలో రెండు పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో ఒకటి పాల ఉత్పత్తి కోసం పశుగ్రాస ప్రాసెసింగ్ యూనిట్, రెండోది మదర్ డెయిరీ పండ్లగుజ్జు పరిశ్రమ ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఈ రెండు ప్రాజెక్టులతో ఎనిమిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలిప్పించనున్నట్లు వివరించారు. కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, ఇండస్ట్రీయల్ డీఎం సూరిబాబు పాల్గొన్నారు.

కుంకీ ఏనుగులెక్కడ సారూ?



తిప్పిరెడ్డిపల్లి వద్ద వరి పంటను తొక్కి నాశనం చేసిన ఏనుగులు

పెద్దపంజాణి: కుంకీ ఏనుగుల ద్వారా అటవీ ఏనుగులను కట్టడి చేస్తామన్న అధికారుల మాటలు నీటిమూటలుగానే మారాయి. ఆదివారం రాత్రి కౌండిన్యలోని ఏనుగుల గుంపు కీలపట్ల అడవిలోంచి పెద్దపంజాణి మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని వరి పంటను తొక్కి నాశనం చేశాయి.

మాపై ఎందుకింత కక్ష?

'ప్రభుత్వం నుంచి వచ్చే పింఛనే ఆధారం. మందులు, మాత్రలు కొనుగోలు చేసుకుంటాం. మిగిలిన మొత్తంతో ఆ నెలంతా సర్దుకుపోతాం. కానీ ఇప్పుడు ఏ ఆధారం లేదు. అనాథలుగా వీధినపడ్డాం. వచ్చే పింఛను తొలగించేశారు. జీవనాధారం లేకుండా చేశారు. చావుకు దగ్గరగా చేర్చేశారు. మాపై ఎందుకింత కక్ష. ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యం..' అంటూ దివ్యాంగులు పెట్టిన రోదనలతో కలెక్టరేట్ మార్మోగింది. తమకు న్యాయం చేయాలంటూ కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడి వారిని కలచివేసింది. ఈ ఘటన సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది.

- ఇష్టారాజ్యంగా దివ్యాంగుల పింఛన్ల తొలగింపు
- జిల్లాలో మొత్తం 4,732 మందికి నోటీసులు
- లబోదిబోమంటున్న బాధితులు
- న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పింఛన్ కోల్పోయిన బాధితులు, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : 'దివ్యాంగులమనే జాలి కూడా లేదు. అకారణంగా మాపై కక్ష పెంచుకున్నారు. కంటితుడుపుగా వైద్యపరీక్షలు నిర్వహించి వికలత్వాన్ని తగ్గించేశారు. వచ్చే పింఛన్ను ఆపేసి మా కడుపు కొట్టారు. మేమెలా బతికేది దేవుడా..!' అంటూ దివ్యాంగులు గగ్గోలు పెట్టారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ భవనం ఎదుట నిరసన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. లేదంటే తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.



పింఛన్ సమస్య పరిష్కారానికి కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధుడికి అన్నం తినిపిస్తున్న భార్య

జిల్లాలో 4,732 పింఛన్ల తొలగింపు

జిల్లాలో వేలాదిగా దివ్యాంగ పింఛన్లు కత్తిరించడం సరైన పద్ధతి కాదని వైఎస్‌ఆర్‌సీపీ దివ్యాంగ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ విమర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్లపైనే ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,732 మంది దివ్యాంగుల పింఛన్‌లు తొలగించడం దారుణమన్నారు. దివ్యాంగులు ఏ పాపం చేశారని అన్యాయంగా పింఛన్‌లు తొలగించారని ప్రశ్నించారు.

సంక్షోభంలోకి దివ్యాంగులు

కూటమి ప్రభుత్వం వ్యవహరించిన ధోరణితో దివ్యాంగుల పింఛన్లకు కోత పడింది. దీంతో వారు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని కొణతం చంద్రశేఖర్ ఆరోపించారు. కొందరు దివ్యాంగులు ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నా...రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా కూటమి ప్రభుత్వానికి ఎందుకు కనబడడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేయడం సబబు కాదన్నారు.

సామాజిక అసమానతలు

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌లను వేలాదిగా తొలగించి సమాజంలో సామాజిక అసమానతలను సృష్టిస్తోందని వికలాంగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి మండిపడ్డారు. వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌లను తొలగించడం అన్యాయమన్నారు. శారీరక వైకల్యం ఉన్నప్పటికీ గంటల కొద్దీ క్యూలో పెట్టి వెరిఫికేషన్ పేరుతో చిత్రహింసలు చేశారన్నారు. అన్ని అర్హతలున్నప్పటికీ దివ్యాంగులు కాదని అనర్హత వేటు వేయడం దారుణమన్నారు. ఈ పాపం ఊరికే పోదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం తొలగించిన పింఛన్‌లను కొనసాగించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తమ సమస్యలను ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్ దృష్టికి తీసుకెళ్లా. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ దివ్యాంగుల విభాగం పూతలపట్టు నియోజకవర్గ అధ్యక్షులు చిరంజీవి, జీడీ నెల్లూరు అధ్యక్షులు రమేష్, జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు సుమతి, నాయకులు లీలాపతినాయుడు, తలారి సుబ్రహ్మణ్యం, సుబ్బమ్మ, ఏకాంబరం, దిలీప్, లోకేష్ పాల్గొన్నారు.

పింఛన్ తీసేశారు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరుకు చెందిన గోవిందు భార్య రాధిక గతంలో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైంది. ఆమెకు వైద్యులు శస్త్రచికిత్సలు చేసి శరీరంలో పలుచోట్ల రాడ్లు అమర్చారు. ఫలితంగా ఆమె ఏపనీ చేసుకోలేదు. ఆమెకు మొన్నటిదాకా పింఛన్ వచ్చేది. కేవలం వచ్చే పింఛనే ఆమెకు ఆధారంగా ఉండేది. కానీ ఇటీవల రాధిక పింఛను తొలగించారు. దీంతో ఆమె తనకు సదరం క్యాంపులో ఇచ్చిన సర్టిఫికెట్‌ను చూపుతూ కన్నీటిపర్యంతమవుతోంది.



పింఛన్ కోల్పోయిన రాధిక



రాధికకు గతంలో జారీ చేసిన సదరం సర్టిఫికెట్



ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం నాయకులు



పలమనేరు: గొబ్బిళ్ల కోటూరు నుంచి దివ్యాంగ కుమారుడిని బైక్‌లో తీసుకొచ్చిన తల్లిదండ్రులు

న్యాయం చేయండి




తిరుపతి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న నందయ్య

పుత్తూరు: రీవెరిఫికేషన్ పేరిట అనేక మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించేశారు. వారందరికీ న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో దళిత గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి వై.నందయ్య వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండీ ఎన్నో ఎళ్లుగా పింఛన్లు పొందుతున్న వారిని సైతం తొలగించడం బాధాకరమన్నారు. అభాగ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం తొలగించిన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఇదేంది 'గురూ'?

- గురువారానికి వాయిదా పడ్డ డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన
- కూటమి ప్రభుత్వం వింత వైఖరిపై మండిపడుతున్న అభ్యర్థులు



చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో చేస్తున్న ప్రచార ఆర్భాటం అంతా ఇంత కాదు. ఏడాది తర్వాత మెగా డీఎస్సీని నిర్వహించారు. తీరా పరీక్షలు పూర్తి అయ్యాక మెరిట్ జాబితా విడుదల చేశాక స్పష్టమైన ఎంపిక అభ్యర్థుల జాబితాలు ఇవ్వకుండా దోబూచులాడుతున్నారు. ఈనెల 25న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. ఆపై ఏమైందో ఏమో వెంటనే 26వ తేదీ అంటూ మరో మారు ప్రకటించి గందరగోళం సృష్టించారు. సోమవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారులతో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మళ్లీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 28వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఆయన వెల్లడించారు.

అంతర్యమేమిటో

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలను వాయిదా వేయడం పట్ల ఆంతర్యమేమిటో అర్థం కాలేదని పలువురు పెదవి విరుస్తున్నారు. రోజుకొక జాబితాను విడుదల చేస్తున్న విద్యాశాఖ అధికారుల తీరు పట్ల అభ్యర్థులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు అనుకూలమైన అభ్యర్థుల కోసం పాకులాడుతోందన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.

రాత్రుల్లో సందేశం..ఉదయాన్నే పరిశీలన

కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియలో రాత్రుల్లో సందేశం పంపి హడావుడి చేసి ఉదయాన్నే పరిశీలనకు హాజరుకావాలనే విధంగా ప్రవర్తిస్తోంది. ఆకస్మిక నిర్ణయాలతో అభ్యర్థుల్లో వివిధ ప్రాంతాల్లో, వివిధ సమస్యలతో ఉంటే ఎలా పరిశీలనకు విచ్చేస్తారని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

ఎందుకింత ఆర్భాటం



డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం ఎంతకెంత ఆర్భాటం చేస్తుందో అర్థం కావడం లేదు. వింత వింత నిర్ణయాల వల్ల ఎంపికైన అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన 1478 మంది అభ్యర్థుల జాబితాను ఎందుకు బహిర్గతం చేయడం లేదో చెప్పాల్సిన అవసరం ఉంది.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌టీచర్స్‌అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్ పోస్టుల కోసం ఎంపికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. సోమవారం చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఎస్పీ మణికంఠ ప్రారంభించారు. ఇటీవల వెలువడ్డ కానిస్టేబుల్ పోస్టుల తుది ఫలితాల్లో 310 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అయితే వెరిఫికేషన్‌కు 296 మంది హాజరయ్యారు. వీళ్లందరి సర్టిఫికెట్లను పరిశీలించారు. త్వరలోనే శిక్షణకు సంబంధించిన కాల్‌లెటర్లు అందుతాయని అధికారులు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడతూ పోలీసు ఉద్యోగమంటే నిజాయితీ, నిబద్ధతతో కూడకున్నదని, సమాజ భద్రతో కానిస్టేబుల్ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిషోర్, డీఎస్పీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,119 మంది స్వామిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

యూరియా.. అంతేనయా?



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

యాదమరి: మండలంలోని రైతులు యూరియా కొరతతో అల్లాడిపోతున్నారు. అరకొర పంపిణీ చేసి అధికారులు చేతులు దులుపుకోవడంపై మండిపడుతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఏవో దీప ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతు సేవా కేంద్రానికి కేవలం 15 బస్తాల యూరియా మాత్రమే కేటాయించడంపై రైతులు నిలదీశారు. ఒక్కో రైతుకు కనీసం ఒక బస్తా యూరియా కూడా ఇవ్వకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు.

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



ఆకట్టుకుంటున్న ఆహ్వాన కటౌట్లు



కొయ్య నాటుతున్న ఈఓ



ఏర్పాటైన అదనపు క్యూలైన్లు

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆహ్వాన కటౌట్ ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి. ఆలయానికి బ్రహ్మోత్సవ శోభను తీసుకొస్తున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లను పెంచారు. మంగళవారం సాయంత్రం నాటికి ఈ ఏర్పాట్లను పూర్తిచేయనున్నారు. అలాగే 28న జరిగే ధ్వజారోహణాన్ని పురస్కరించుకుని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేసి పచ్చని పందిరి కొయ్యను నాటారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, సిబ్బంది బాలాజీ నాయుడు పాల్గొన్నారు. – కాణిపాకం

క్లుప్తంగా

కాణిపాక ఆలయ అర్చకుడి కన్నుమూత



నివాళి అర్పిస్తున్న ఈఓ పెంచల కిషోర్

ఐరాల: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి అనుసంధానమైన ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న హరీష్(50) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. కాగా మృతుడు మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారంలో నివాసముంటున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కాణిపాకం ఆలయం ఈఓ పెంచల కిషోర్ గ్రామానికి చేరుకుని హరీష మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.


చిత్తూరులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దాదాపు 80 ఏళ్ల వయస్సున్న వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందతూ ఆదివారం కన్నుమూశాడు. ఇతని కుటుంబ సభ్యుల వివరాలు లేకపోవడంతో వైద్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వివరాలు తెలిస్తే ఫోన్-9491074517, 9440796706 నంబర్లకు సంప్రదించాలని టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కోరారు.

ఏపీసీకి ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి పొందిన ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రశిక్షాశాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణకు తన మాతృశాఖలో ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మాతృశాఖ అయిన కో-ఆపరేటివ్ శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేడర్‌లో ఉన్న ఆయన కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా సమగ్రశిక్షా శాఖ ఏపీసీగా డెప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన మాతృశాఖలో తాజాగా ఆయనకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేడర్ నుంచి డివిజనల్ లెవల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఉద్యోగోన్నతి కల్పించడంతో పాటు ఆయనకు చిత్తూరు డివిజన్ లెవల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఆయన ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న జిల్లా సమగ్ర శిక్షా శాఖ ఏపీసీగా రిలీవ్ కానున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు



చిత్తూరు: నిందితులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు



నగరి: నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్/నగరి : చిత్తూరు జిల్లాలో సోమవారం గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం.. చిత్తూరు-బెంగళూరు బైపాస్ రోడ్డులోని రోసీనగర్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న గణేష్, లోకేష్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరూ బంగారుపాళ్యంకు చెందిన వ్యక్తులని.. మరోవ్యక్తి పారిపోయాడని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నగరి మండలంలో..

నగరి మండలం, తడుకుపేట గ్రామం తిరుపతి-చెన్నై హైవేకి ఆనుకుని ఉన్న మిక్సింగ్ ప్లాంట్ వద్ద ఎస్‌ఐ విజయ్‌నాయక్, ట్రైనీ ఎస్‌ఐ తేజస్విని పోలీసులు, డిప్యూటీ తహసీల్దార్ మేఘవర్ణంతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం, చెన్నై ఆవడికి చెందిన వెంకటేష్ (23), డి.కమలేష్ (18) తమకు ముందస్తు పరిచయం ఉన్న నగరి తడుకుపేట ఎస్టీ కాలనీకి చెందిన ఉదయ్ కిరణ్ (23), దేవేంద్ర(24) వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తుండగా వారిని అక్కడే అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసేవారిని పట్టుకోవడంతో ప్రతిభ కనబరచిన సిబ్బంది సత్య, గజేంద్ర, కదిరివేలు, గోపి, లోకనాథం, రవి, సురేష్, రమేష్‌ను అభినందించారు.

ప్రసన్న వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అప్పలాయగుంటలో హరిజరినాథశర్మ

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామిని మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి హరిజరినాథశర్మ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దోపిడీ దొంగ అరెస్టు



బంగారు ఆభరణాలను చూపుతున్న పోలీసులు

చిత్తూరు కార్పొరేషన్: రైల్లో దోపిడీ చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న దొంగను సోమవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.5.76 లక్షల విలువ చేసే 64 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే రేణిగుంట సీఐ యతీంద్ర వివరాలను తెలియజేశారు. ఈనెల 6న తిరుపతి-మదనపల్లికి వెళ్తున్న వేసవి ప్రత్యేక రైలులో తిరుపతికి చెందిన కవిత ప్రయాణిస్తోందని తెలిపారు. పాకాల సమీపంలో వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని దొంగలు ఆమెపై కత్తితో దాడి చేసి మెడలోని బంగారు మంగళ సూత్రం, గొలుసు, ఇతర ఆభరణాలను దోచుకెళ్లారన్నారు. దర్యాప్తులో దొంగను గుర్తించి అరెస్టు చేసినట్టు వెల్లడించారు.

చైన్‌స్నాచింగ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లిపోయారు. గొడుగు మూరుకు చెందిన అంజలి సోమవారం సాయంత్రం పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్నారు. ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు.. చిరునామా అడిగిట్టు అడిగి, అంజలి మెడలో ఉన్న గొలుసును తెంపుకెళ్లారు. బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ మహేశ్వర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్చాలి

తవణంపల్లె: బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి, ఏఎస్‌ఓ నందకుమార్ తెలిపారు. సోమవారం మండలంలో బడి బయట ఉన్న ముగ్గురు పిల్లలను బడిలో చేర్పించారు. బీసీ కాలనీకి చెందిన ఎస్.దేవిని అరగొండ బాలికోన్నత పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా కట్టకిందపల్లె ఎస్టీ కాలనీకి చెందిన సునీత, జీవితను కట్టకిందపల్లె ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించారు. ఏఎల్ఎస్‌ఓ శశికుమార్, ఎంఈఓ మోహన్‌రెడ్డి, సీఆర్ఎంటీలు చిట్టిబాబు, రేఖ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేల్లో యూరియా టోకెన్ల డ్రామా!

పలమనేరు: ఆర్‌ఎస్‌కేల్లో యూరియా టోకెన్ల డ్రామాను కూటమి ప్రభుత్వం రక్తికట్టించింది. యూరియా కావాల్సిన వారి వివరాలను నమోదు చేసుకొని, వారి బయోమెట్రిక్ సేకరించి టోకెన్లు అందించే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టింది. సాయంత్రం దాకా రైతులకు టోకెన్లు ఇచ్చే పనులను చేశారు. ఒక్కో ఆర్‌ఎస్‌కేకు సగటున 150 బస్తాల యూరియాను మాత్రమే కేటాయించారు. కానీ రైతులు మాత్రం నాలుగు వందల మంది దాకా వచ్చారు. వీరికి సోమవారం యూరియా దక్కకపోగా కేవలం బయోమెట్రిక్ చేసిన కొందరికి మాత్రమే టోకెన్లు ఇచ్చారు. మండలంలోని కల్లాడు ఆర్‌ఎస్‌కేలో ప్రస్తుతం 500మంది రైతులకు యూరియా అవసరం కాగా.. అక్కడి అగ్రికల్చర్ సహాయకులు ఓ వంద మందికి మాత్రమే టోకెన్లను అందించారు. మిగిలిన వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

పకడ్బందీగా స్వామిత్వ కుటుంబ సర్వే



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్

ఐరాల: స్వామిత్వ కుటంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఆయా గ్రామాల పరిధిలోని ప్రతి ఇంటినీ సర్వే చేయాలని సూచించారు. సర్వే పూర్తి చేసిన తర్వాత ప్రతి కుటుంబానికీ స్వామిత్వ కార్డును అందజేయాలని ఆదేశించారు. డీపీఓ మాట్లాడుతూ ఐవీఆర్‌ఎస్ సర్వే, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎంపీడీఓ ధనలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మూడు టీచర్ పోస్టులకు ఎంపిక



మురళీమోహన్

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోటకు చెందిన పి.గంగిరెడ్డి కుమారుడు పి.మురళీమోహన్ మూడు టీచర్ పోస్టులకు ఎంపికయ్యాడు. ఈయన ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల విడుదలచేసిన డీఎస్సీ 2025 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 78.07 మార్కులు సాధించి 16వ ర్యాంకు, పీజీటీలో 77.5 మార్కులతో రాయలసీమ జోన్‌లో 20 వర్యాంకు, సాధించారు. అలాగే టీజీటీలో 72.20 మార్కులు సాధించి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు.

అధ్యక్ష పదవికి.. సంకుల సమరం!

- టీడీపీ జిల్లా కుర్చీ తమదేనంటున్న కమ్మ సామాజికవర్గం
- ప్రస్తుత అధ్యక్షుడినే కొనసాగించాలన్న సీనియర్లు
- కుదరని సయోధ్య.. 15 మందికి పైగా పోటీ
- చంద్రబాబుకు నివేదిస్తామన్న త్రిసభ్య కమిటీ



అభిప్రాయ సేకరణలో టీడీపీ త్రిసభ్య కమిటీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

చిత్తూరు అర్బన్: 'పార్టీ కష్టకాలాల్లో ఉన్నప్పుడు కార్యాలయానికి రావడానికి కూడా చాలామంది మొహం చాటేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పదవుల కోసం పాకులాడుతున్నారు. ఉదయం పచ్చ కండువా.. చీకటి పడితే ప్రత్యర్థులతో లాలూచీ.. అలాంటి వాళ్లకు పదవులు ఇవ్వకండి. ఆ కోవర్టుల వల్ల పార్టీ నాశనం అవుతుంది..' అంటూ జిల్లాకు చెందిన ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే తన గళాన్ని గట్టిగానే వినిపించారు. చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవితో పాటు అనుబంధ కమిటీల కూర్పు కోసం రాష్ట్ర పార్టీ నాయకత్వం అభిప్రాయ సేకరణకు దూతలను పంపింది. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి బిసి.జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావుతో కూడిన త్రిసభ్య కమిటీ సోమవారం చిత్తూరులోని ఓ హోటల్‌లో భేటీ నిర్వహించింది. చిత్తూరు ఎంపీ ప్రసాదరావుతో పాటు ఎమ్మెల్యేలు జగన్‌మోహన్, థామస్, నాని, భానుప్రకాష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇతర టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దందాలు చేసుకోవడానికా?

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కనిపించని వ్యక్తులు, ఇప్పుడు జిల్లా అధ్యక్ష అందలం ఎక్కి వ్యాపారాలు, దందాలు చేసుకోవడానికి తప్ప.. పార్టీ బలోపేతానికి కాదని పలువురు సీనియర్లు వారి అభిప్రాయాన్ని త్రిసభ్య కమిటీ ఎదుట కుండబద్ధలు కొట్టినట్లు సమాచారం. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్సీ సామాజికవర్గానికి ఇవ్వాలని, తెలుగు యువతను బీసీకు ఇవ్వాలని పలువురు పట్టుబట్టినట్లు తెలిసింది. అయితే వచ్చిన దరఖాస్తులను, ఎమ్మెల్యేలు, ఎంపీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని.. చంద్రబాబు నాయుడుకు నివేదిక ఇవ్వనున్నట్లు త్రిసభ్య కమిటీ తేల్చి చెప్పింది. ఏదిఏమైనా టీడీపీలో నూతన కమిటీ కూర్పు తేనెతుట్టెను కదిపినట్లేనని.. లాబీయింగ్‌కు పదవులు దక్కుతాయో..? కష్టపడేవాళ్లను గుర్తిస్తారో..! చూడాలని పలువురు బాహాటంగానే చెబుతున్నారు.

తమకే కావాలి!

ప్రస్తుతం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సిఆర్.రాజన్‌కు రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడంతో ఆయన్ను దానికే పరిమితం చేసేలా ఓ వర్గం ప్రణాళిక రూపొందించింది. రాజన్ స్థానంలో జిల్లా అధ్యక్ష పదవిని కమ్మ సామాజికవర్గానికే కేటాయించాలని పలువురు త్రిసభ్య కమిటీ ఎదుట అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఇదే నిర్ణయాన్ని వెల్లిబుచ్చి.. రాజన్ నాయకత్వాన్ని వ్యతిరేకించినట్లు తెలిసింది. కమ్మ సామాజికవర్గం నుంచి బంగారుపాళ్యంకు చెందిన ఎన్‌పి.జయప్రకాష్‌నాయుడు, చిత్తూరుకు చెందిన చెరుకూరి వసంత్ కుమార్ నాయుడు, పాలసముద్రం భీమినేని చిట్టిబాబు నాయుడు, పుత్తూరుకు చెందిన పోతుగుంట విజయబాబు, చంద్రగిరికి చెందిన హేమాంబరరావు తదితరులు 15 మంది వరకు ప్రతిపాదనలను త్రిసభ్య కమిటీకి అందజేశారు. ఇక కుప్పంకు చెందిన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కూడా తన దరఖాస్తును అందజేశారు.

రండి బాబూ రండి.. నేడే ఆఖరు!

- మద్యం బార్లకు ఒక్క దరఖాస్తు పడితే ఒట్టు
- బేరం కుదరక.. పాలసీలో మెలికలు నచ్చక..
- నేటితో ముగియనున్న గడువు.. పొడిగింపు తప్పదా?



స్పందన లేదాయె!

చిత్తూరు అర్బన్: జిల్లాలో మద్యం బార్ల నిర్వహణ కోసం లైసెన్సులు జారీ చేయడానికి అధికారులు ఇచ్చిన నోటిఫికేషన్‌పై వ్యాపారుల్లో స్పందన కరువైంది. గతవారం నూతన మద్యం బార్లకు నోటిఫికేషన్ ఇస్తే ఇప్పటి వరకు ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. మంగళవారంతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగియనుంది. ఈ క్రమంలో బార్ల నోటిఫికేషన్ గడువును పొడిగించడం తప్ప.. ప్రభుత్వం వద్ద మరో మార్గం లేదని వ్యాపారాలు చెబుతున్నారు.

ఇషారాజ్యమే కారణమా?

జిల్లాలో 2025-28 సంవత్సరానికి మొత్తం మూడేళ్ల పాటు మద్యం బార్లను నిర్వహించడానికి ప్రభుత్వం గత వారం నోటిఫికేషన్ విడుదల చేసింది. చిత్తూరు జిల్లాలో 10 మద్యం బార్లకు నోటిఫికేషన్ ఇచ్చింది. దీనికి మించిన పాలసీ ఎప్పుడూ చూడలేదని, ఇదే ఉత్తమ పాలసీ అంటూ ఎక్సైజ్ అధికారులు ఊదరగొట్టారు. మరి ఇంతటి ఉత్తమ పాలసీకి ఆఖరు తేదీ వస్తున్నా, ఎందుకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ప్రశ్నిస్తే.. మౌనమే సమాధానం. మద్యం దుకాణంతో పోలిస్తే బార్‌కు లైసెన్సు ఫీజు తక్కువే. లాభాలు కూడా బాగానే ఉంటాయి. కానీ ఇదే సమయంలో బార్ నిర్వహణ, రెస్టారెంట్, పనిచేసే వాళ్ల సంఖ్య, ఇతర ఖర్చులు చాలా ఎక్కువగా ఉన్నట్లు ఇప్పటికే బార్లు నిర్వహిస్తున్న వాళ్లు చెబుతున్నారు. ఇది కాకుండా ప్రతీ బార్ కోసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని షరతు పెట్టడం, ఒక్కో దరఖాస్తుకు నాన్-రీఫండబుల్ ఫీజు రూపంలో రూ.5.1 లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉండడం లాంటివి బార్ పాలసీని నీరుగారుస్తున్నాయి. ఇక మద్యం బార్ పెట్టే ప్రతీచోటా స్థానిక ప్రజాప్రతినిధులకు నెలవారీ మామూళ్లు 4 శాతం ఇవ్వాలని ఇప్పటికే పచ్చ నేతలు తీర్మానం చేశారు. ఇంత మొత్తం ఖర్చుపెట్టుకుని, పెట్టుబడి కూడా రాకుంటే వ్యాపారం చేయడం కష్టమని చాలా మంది బార్ పాలసీపై నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు నగరంలో ఏడు, పుంగనూరు, పలమనేరు, కుప్పం, నగరి మునిసిపాలిటీల్లో ఒక్కో బార్‌కు దరఖాస్తులు పిలిచినా అధికారులకు ఆశాభంగం తప్పలేదు. 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 28న లాటరీ పద్ధతిలో లైసెన్సు దారుడిని ఎంపికచేస్తామని చెప్పారు. కానీ గడువు దగ్గరకు వచ్చేస్తున్నా ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తుకు ముందు ఆసక్తి ఉన్న వాళ్లు పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటారు. జిల్లాలో కేవలం 11 మంది మాత్రమే పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే, లైసెన్సు ప్రక్రియ కోసం లాటరీ పద్ధతి నిర్వహిస్తారు. లేకుంటే మొత్తం ప్రక్రియ వాయిదా వేయాల్సి ఉంది.

గడువు పెంచుతారా?

బార్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును పెంచుతారని ప్రాథమికంగా తెలుస్తోంది. కల్లుగీత సామాజికవర్గానికి చిత్తూరు నగరంలో ఒక బారు రిజర్వు చేయడం, దానికి 50 శాతం లైసెన్సు ఫీజు రాయితీతో 28 తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఇచ్చారు. 30న లాటరీ నిర్వహిస్తారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నూతన బార్ పాలసీ అమల్లోకి రావాల్సి ఉంది. 28వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు పెంచి, 30న లాటరీ నిర్వహించడానికి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

కుప్పంలో కస్సు.. బస్సు!

- మహిళలకు ఉచిత బస్సుల్లో కోతలు
- 100 సర్వీసులుంటే 48 సర్వీసుల్లోనే ఉచితం



తిరుపతి- కుప్పం ఎక్స్‌ప్రెస్ బండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుప్పంలో మహిళలకు ఉచిత బస్సు పథకం తూతూమంత్రంగా సాగుతోంది. ఉచితానికి అర్హత ఉన్న 27 బస్సులను అంతర్రాష్ట్ర సర్వీసులుగా తిప్పుతున్నారు. ఇక పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను సైతం తమిళనాడు చుట్టూ తిరిగొస్తున్నాయి. దీంతో ఉచిత ప్రయాణం రోజువారీగా 31శాతం దాటడం లేదని అధికారులు గణాంకాలు కట్టారు. ఈ అరకొర సేవలపై మహిళలు మండిపడుతున్నారు. దీనికితోడు బెంగళూరుకు జీరో సర్వీసులంటూ వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుప్పం పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి ఈ అరకొర సేవలపై స్పందించాలని మహిళలు కోరుతున్నారు.

జిల్లాలో మొత్తం ఐదు డిపోలున్నాయి. ఈ డిపోల పరిధిలో మొత్తం అద్దె బస్సులతో కలిపి 461 సర్వీసులు నడుస్తున్నాయి. అయితే చిత్తూరు-2డిపో తర్వాత కుప్పం డిపోకే అధిక సర్వీసులున్నాయి. ఆ డిపోలోనే అత్యధికంగా ఉచిత బస్సులకు కోతలు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా స్త్రీశక్తి పథకానికి 339 బస్సులు అర్హత ఉంటే .. వీటిల్లో 75 వరకు అంతర్రాష్ట్ర సర్వీసులుగా తిరుగుతున్నాయి.

కోతలు ఇలా!

కుప్పం డిపో పరిధిలో మొత్తం 100 సర్వీసులున్నాయి. ఇందులో పల్లెవెలుగు 59, ఎక్స్‌ప్రెస్16, సప్తగిరి 17, సూపర్‌లగ్జరీ 8 సర్వీసులున్నాయి. ఇందులో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 75 దాకా ఉన్నాయి. ఈ బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలకు అర్హత ఉన్నా... 27 సర్వీసులను అంతరాష్ట్ర సర్వీసులంటూ తిప్పుతున్నారు. ఇందుల్లో పల్లెవెలుగు సర్వీసులు 25, ఎక్స్‌ప్రెస్ 2వరకు ఉన్నాయి. వీటిని కేజీఎఫ్, క్రిష్ణగిరి, తిరుపత్తూరు, వాణియంబడి, వేలూరుకు నడిపిస్తున్నారు. ఈ కారణంగా 100 బస్సుల్లో ఉచితానికి 48 బస్సులు మాత్రమే మిగిలాయి. దీనికితోడు తిరుపతి, చిత్తూరు మీదుగా కుప్పంకు 39 సర్వీసులుటే ఇందులో కేవలం 14 సర్వీసులు మాత్రమే ఉచితమంటున్నారు. ఇక చిత్తూరు-2డిపో పరిధిలో 79 బస్సులకు అర్హత ఉంటే 27 సర్వీసులు అంతర్రాష్ట్ర సర్వీసులంటూ చేతులెత్తేశారు.

కుప్పం- బెంగళూరుకు బస్సు ఏదీ?

కుప్పం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో బెంగళూరుకు వలస వెళుతుంటారు. అక్కడ ఉపాధి చేస్తూ...కుప్పంలో జీవనం గడుపుతున్నారు. ఇలాంటి వారికి ఆర్టీసీ ప్రయాణం ఆమడదూరంలో ఉంది. కేజీఎఫ్ వరకు మాత్రమే రెండు సర్వీసులు నడుస్తున్నాయి. బెంగళూరు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక కుప్పం వాసులు నరకం అనుభవిస్తున్నారు.

జిల్లా సమాచారం

డిపో	అర్హత ఉన్న సర్వీసులు (పల్లెవెలుగు,ఎక్స్‌ప్రెస్)	అంతర్రాష్ట్రల సర్వీసులు (పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్)
చిత్తూరు	165	17
చిత్తూరు	279	27
పలమనేరు	57	5
పుంగనూరు	63	5
కుప్పం	75	27

జేసీ మేడం.. న్యాయం చేయండి

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- వివిధ సమస్యలపై 359 అర్జీలు స్వీకరించిన జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యల పరిష్కారం కోసం చాలారోజుల నుంచి తిరుగుతూనే ఉన్నాం.. న్యాయం చేయండి జేసీ మేడం..! అంటూ అర్జీదారులు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై 359 అర్జీలిచ్చినట్టు కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్లు వినతులు స్వీకరించారు. కాగా పీజీఆర్ఎస్ కార్యాలయంలో నెట్‌వర్క్ సమస్యతో ప్రజల అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఇబ్బందులెదురయ్యాయి. మొదటి గంట పాటు పనిచేసిన నెట్‌వర్క్ ఆ తర్వాత మొరాయించింది. దీంతో అర్జీదారుల వినతులను అధికారులు నేరుగా స్వీకరించి పంపించేశారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్

పింఛన్ ఇప్పించండి



పింఛన్ కోసం తిరుగుతున్న దివ్యాంగుడు గజేంద్ర

తనకు రెండు కాళ్లు లేవని, దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని చిత్తూరు మండలం, నరసింగరాయుని పేటకు చెందిన గజేంద్ర వాపోయారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తనకు రెండు కాళ్లు లేకపోవడంతో జీవనాధారం కరువైందన్నారు. తన కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హుడైనప్పటికీ తనకు పింఛన్ ఇవ్వడం లేదన్నారు.

పిల్లలు అవస్థలు పడుతున్నారు



పాఠశాల విలీనంతో సమస్యలు ఏర్పడుతున్నాయంటున్న గొల్లకండ్రిగ గ్రామస్తులు

పాఠశాలను విలీనం చేయడంతో తమ పిల్లలు ప్రతి రోజూ మూడు కి.మీ నడుస్తున్నారని కార్వేటినగరం మండలం, గొల్లకండ్రిగ గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. గ్రామస్తులు రాధాకృష్ణన్, రీత, సుందరమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను విలీనం చేశారన్నారు. విలీనం చేసిన పాఠశాలకు వెళ్లే దారిలో కాలువలు, బావులు ఉన్నాయని, పిల్లలకు ఏం జరుగుతుందో తెలియడం లేదని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

దౌర్జన్యం చేస్తున్నారు



దౌర్జన్యం చేస్తున్నారంటున్న బొమ్మయ్యపల్లె వాసులు

తమ గ్రామంలో సీసీ రోడ్లు ఎందుకు వేయలేదని అడిగినందుకు దౌర్జన్యం చేస్తున్నారని వెదురుకుప్పం మండలం, బొమ్మయ్యపల్లె దళితవాడ వాసులు వాపోయారు. ఈ మేరకు ప్లకార్డులు చేతబట్టి నిరసన చేపట్టారు. ఆ గ్రామానికి చెందిన సోమనాథన్, బాలకృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో తమ గ్రామానికి సీసీ రోడ్లు మంజూరైనట్లు చెప్పారు. అయితే కొందరు సీసీ రోడ్లు తమ గ్రామంలో వేయకుండా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఉపాధి పనులు లేవంటున్నారు



ఉపాధి పనుల కోసం వచ్చిన ఎం.అగరం గ్రామస్తులు

'కూటమి ప్రభుత్వ మేమో వేలాదిమందికి కూలి పనులు కల్పిస్తున్నామని ప్రకటిస్తుంటే ఇక్కడి అధికారులేమో పనులు లేవని చెబుతున్నారు' అని విజయపురం మండలం ఎం.అగరం గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభావతి, మారియమ్మ మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఉపాధి పనులు కల్పించడం లేదన్నారు. కూలి పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను అడుగుతుంటే కుదరదంటూ బెదిరిస్తున్నారన్నారు. రెండు నెలలుగా తినడానికి కూడా కష్టంగా ఉందని కన్నీరుపెట్టుకున్నారు.

గృహాలు మంజూరు చేయండి



గృహాలు మంజూరు చేయాలంటున్న మురకంబట్టు గ్రామస్తులు

తమకు పక్కాగృహాలు మంజూరు చేయాలంటూ చిత్తూరు నగరంలోని మురకంబట్టు గ్రామస్తులు కోరారు. గ్రామానికి చెందిన దీప, రాధ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నామన్నారు. కూలి పనులు చేసుకుంటున్న తాము అద్దెలు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. అప్పు చేసి టిడ్కో ఇళ్లకు నగదు చెల్లించామని, అయితే ఆ గృహాలు ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు.